# కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక 8వ అధ్యాయము

## విగ్రహార్పిత సమస్యలు

విగ్రహములకు బలిగా అర్పించిన వాటి విషయము :- మనమందరము జ్ఞానము గలవారమని యెరుగుదుము. జ్ఞానము ఉప్పొంగ జేయును గాని, ప్రేమ క్షేమాభివృద్ధి కలుగజేయును. 2 ఒకడు తన కేమైనను తెలియుననుకొని యుంటే, తాను తెలిసికొనవలసినట్టు ఇంకను ఏమియు తెలిసికొనిన వాడు కాడు. 3 ఒకడు దేవుని ప్రేమించినయెడల అతడు దేవునికి ఎరుకైనవాడే. 4 కాబట్టి విగ్రహములకు బలిగా అర్పించిన వాటిని తినుట విషయము - లోకమందు విగ్రహము వట్టిదనియు, ఒక్కడే దేవుడు తప్ప వేరొక దేవుడు లేడనియు ఎరుగుదుము. 5 దేవతలనబడిన వారును ప్రభువులనబడినవారును అనేకులున్నారు.

6 ఆకాశమందైనను భూమిమీదనైనను దేవతలనబడినవి ఉన్నను, మనకు ఒక్కడే దేవుడున్నాడు, ఆయన తండ్రి ఆయన నుండాలసమస్తమును కలిగెను ఆయన నిమిత్తము మనమున్నాము. మరియు మనకు ప్రభువు ఒక్కడే, ఆయన యేసుక్రీస్తు ఆయన ద్వారా సమస్తమును కలిగెను మనము ఆయన ద్వారా కలిగిన వారము.

## బలహీనమైన సహోదరుల మనస్సాక్షి నిమిత్తమై జాగ్రత్త

7 అయితే అందరి యందు ఈ జ్ఞానము లేదు. కొందరిదివరకు విగ్రహమును ఆరాధించినవారు గనుక తాము భుజించు పదార్థములు విగ్రహమునకు బలి ఇయ్యబడినవి అని ఎంచి భుజించుదురు. ఇందువలన వారి మనస్సాక్షి బలహీనమైనదై అపవిత్రమగుచున్నది. 8 భోజనమును బట్టి దేవుని యెదుట మనము మెప్పుపొందము తినక పోయినందున మనకు తక్కువ లేదు, తినినందున మనకు ఎక్కువ లేదు. 9 అయినను మీకు కలిగియున్న ఈ స్వాతంత్ర్యమువలన బలహీనులకు అభ్యంతరము కలుగకుండా చూచుకొనుడి 10 ఏలయనగా జ్ఞానము గల నీవు విగ్రహాలయమందు భోజనపంక్తిని కూర్చుండగా, ఒకడు చూచిన యెడల బలహీనమైన మనస్సాక్షి గల అతడు విగ్రహములకు బలి ఇయ్యబడిన పదార్థములను తినుటకు ధైర్యము తెచ్చుకొనును గదా? 11 అందువలన ఎవని కొరకు క్రీస్తు చనిపోయెనో ఆ బలహీనుడైన ఆ నీ సహోదరుడు నీ జ్ఞానమును బట్టి నశించును. 12 ఈలాగు సహోదరులకు విరోధముగా పాపము చేయుటవలనను, వారి బలహీనమైన మనస్సాక్షిని నొప్పించుటవలనను మీరు క్రీస్తునకు విరోధముగా పాపము చేయువారగు చున్నారు. 13 కాబట్టి భోజనపదార్థమువలన నా సహోదరునికి అభ్యంతరము కలిగిన యెడల, నా సహోదరునికి అభ్యంతరము కలుగ జేయకుండుటకై నేనెన్నటికిని మాంసము తినను.